సమాజాన్ని తీర్చిదిద్దే శక్తిమంతులు మహిళలు

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ సతీమణి సుధా దేవ్‌జీ వర్మ • ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



గంగారంలోని మహిళ దక్షిత సమితి విద్యా సంస్థలలో.. జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించిన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సతీమణి సుధా దేవ్ జీ వర్మ తదితరులు

చందానగర్: మహిళలు సమాజాన్ని తీర్చిదిద్దే శక్తిమంతులని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సతీమణి సుధా దేవ్ జీ వర్మ పేర్కొన్నారు.చందానగర్ గంగారంలోని మహిళ దక్షిత సమితి విద్యా సంస్థలలో శనివారం అంతర్జాతీయ మహిళల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సతీమణి సుధా, ప్రముఖ వ్యాపార సలహాదారు, దాత ఉషా గోపాలరత్నం, లలిత కనోడియా, మహిళ దక్షిత సమితి విద్యా సంస్థల అధ్యక్షురాలు డాక్టర్ సరోజ్ బజాజ్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధా మాట్లాడుతూ పసిపాపను లాలించే చేయి ప్రపంచాన్ని పాలించగలదు అని అన్నారు. మహిళలు నిత్యం మార్పును తెచ్చే శక్తిగా నిలుస్తున్నారన్నారు. అనంతరం డాక్టర్ సరోజ్ బజాజ్ అంకితభావాన్ని అభినందించారు. మహిళలు ఆర్థిక స్వాతంత్ర్యం సాధించడం ద్వారా సమాజ అభివృద్ధికి దోహదం చేస్తారన్నారు. అనంతరం విశేష సేవలు అందించిన మహిళా ఉపాధ్యాయులను సిబ్బందిని సత్కరించారు. సుమన్ జూనియర్ కళాశాల విడి బజాజ్, డిగ్రీ కళాశాల ఉపాధ్యాయులు ఉషా, అరుణ, మహిళ దక్షిత సమితి, బన్సీలాల్ మలాని నర్సింగ్ కళాశాల ఉపాధ్యాయులు వింధ్యాదేవి, నరీషారాణిలకు బహుమతులు అందజేశారు.



తారానగర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన మహిళలు

మహిళలకు అనుకూల వాతావరణం ఉండాలి

రాయదుర్గం: మహిళలు మరింతగా రాణించాలంటే అనుకూల వాతావరణం ఉండాలని ధృవాంశ్ ఎన్‌జీఓ సంస్థ సీఈఓ మధులికాచౌదరి అభిప్రాయపడ్డారు. మహిళా దినోత్సవం సందర్భంగా గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ఆమె జ్యోతి వెలిగించి సమావేశాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు ముఖ్యంగా సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రాజకీయరంగాలలో ఎదిగేలా వారిని ప్రోత్సహించాలని సూచించారు. ఎస్కీ డైరెక్టర్ డాక్టర జి రామేశ్వరరావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ వృత్తిలో ప్రస్తుతం మహిళలు ముఖ్య భూమిక పోషిస్తున్నారన్నారు. అనంతరం మహిళా అధికారులు, ఉద్యోగులకు వివిధ రకాల క్రీడలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు.

కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో

గచ్చిబౌలి: అంతర్జాతీయ మహిళా దినోత్సవంను కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో శనివారం ఘనంగా నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ అనురాగిని రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్లు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది కేక్ కట్ చేశారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. టీజీఎస్‌ఎస్‌పీ కొండాపూర్ 8వ బెటాలియన్‌లో కమాండెంట్ రామకృష్ణ ఆధ్వర్యంలో కేట్ కట్ చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు .కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ బీవీ రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్లు పాల్గొన్నారు.



రోగులకు పండ్లు, స్వీట్లు పంచుతున్న డాక్టర్ అనురాగిని రెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్ చంద్ర కృష్ణ



టీజీఎస్ఎస్‌పీ కొండాపూర్ 8వ బెటాలియన్‌లో..

సత్కారం

రాయదుర్గం: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నానక్‌రాంగూడలోని బీజేపీ గచ్చిబౌలి డివిజన్ కార్యాలయంలో మహిళలను ఘనంగా సత్కరించారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు శివాసింగ్, సీనియర్ నాయకులు వసంతకుమార్‌యాదవ్, పార్టీ మహిళా ప్రతినిధులు వరలక్ష్మీ, ధీరజ్, ఉదయలక్ష్మీ, మహతి, శ్రీలక్ష్మీ, హేమ, కిషన్, బబ్లూసింగ్, ఉమేష్, గోపాల్ పాల్గొన్నారు.



వేడుకలలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి



చందానగర్ పోలీస్‌స్టేషన్‌లో..



మిరియాల రాఘవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ..



మహిళలను సన్మానిస్తున్న ఉదయ్ కిరణ్



గోపన్‌పల్లిలో మహిళలను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్, బీజేపీ నాయకుడు రవికుమార్‌యాదవ్

ఉచిత వైద్యశిబిరం



శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న విద్యార్థినులు

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని ఎఫ్‌డీడీఐ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ తేజ్‌లోహిత్ రెడ్డి పేర్కొన్నారు.రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐలో శనివారం హెల్త్ కేర్ కంపెనీ- కురియన్ కనెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తేజ్‌లోహిత్‌రెడ్డి, ఫ్యాకల్టీ, విద్యార్థులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యం వాకింగ్ ,యోగా విధిగా చేయాలని సూచించారు. ఆరోగ్యంగా ఉంటేనే పని చేయగలమన్నారు. కార్యక్రమంలో కురియన్ కనెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ రవి రాచర్ల, ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ ఎం గంగాధర్, డాక్టర్ మణికంఠ, సాయివర్షిత్, రమేష్, బి శాలిని, ఎం దివ్య, ఫ్యాకల్టీ డాక్టర్ ముప్పిడి రాంబాబు, అనామిక, బిందుసింగ్, డాక్టర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో ర్యాలీ



రాయదుర్గం: హెచ్‌సీయూలోని స్టూడెంట్స్ యూనియన్-25 ఆధ్వర్యంలో విద్యార్థులు, కార్మికులు సంయుక్తంగా ర్యాలీ నిర్వహించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం క్యాంపస్‌లోని నార్త్ షాపింగ్‌కాంప్లెక్స్ నుంచి ప్రధాన గేటు వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా పలు నినాదాలు చేశారు. కార్యక్రమంలో స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షుడు ఉమేష్ అంబేద్కర్, ప్రధాన కార్యదర్శి నిహాద్, ఉపాధ్యక్షుడు ఆకాష్, డీఎస్‌యూ అధ్యక్షుడు తుంగ రమేష్, ఏఎస్‌ఏ అధ్యక్షురాలు వెన్నెల, బీఎస్‌ఎఫ్ ప్రధాన కార్యదర్శి ముద్దం నవీన్, యూనివర్సిటీ వర్కర్స్ పాల్గొన్నారు.

ముగిసిన సాంకేతిక ఉత్సవం

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ వట్టినాగులపల్లిలోని శ్రీదేవి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శుక్ర, శనివారాల్లో నిర్వహించిన సాంకేతిక ఉత్సవం విద్యుత్ 5.0 ముగిసింది. ఇన్నోవేషన్ మీట్స్ ఇన్‌స్పిరేషన్ అనే థీమ్‌తో కొనసాగిన కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగింది. కార్యక్రమ ముగింపు ఉత్సవంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.నర్మద మాట్లాడుతూ... ఇలాంటి కార్యక్రమాలు కొత్త టెక్నీషియన్లలో జ్ఞానం, సామాజిక చిక్కుల గురించి అవగాహనతో పాటు కమ్యూనికేషన్, నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ఉపయోగపడతాయన్నారు. సాంకేతికంగా తాజా పోకడలు, కొత్త అవకాశాల గురించి తెలుసుకోవటానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో 25 కళాశాలల నుంచి 1500 రిజిస్ట్రేషన్లు వచ్చాయన్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారాలను అందించారు. కో ఆర్డినేటర్లు మంజుల, భవ్య, జెపి రూత్, డాక్టర్ కె. శివనాగిరెడ్డి, డి.నరేంద్రకుమార్ పాల్గొన్నారు.



మార్పు అవసరం

మహిళల మనోగతం

భారత రాష్ట్రపతి పదవి నుంచి అత్యున్నత స్థాయి ప్రజాప్రతినిధులుగా ఇలా రకరకాల పదవుల్లో ఇంటాబయిటా మహిళలు తమ సత్తా చాటుతూ వస్తున్నారు. లింగ సమానత్వం, మహిళా సాధికారత దిశగా.. మహిళల హక్కులను, సామాజికంగా వారి పాత్రను గుర్తించుకునే రోజు అంతర్జాతీయ మహిళా దినోత్సవం. కానీ నేటి సమాజంలో అనేక సమస్యలున్న తరుణంలో ఇంకా మార్పు రావాలంటున్నారు మహిళలు.

– గచ్చిబౌలి/రాయదుర్గం

సమానత్వం కల్పించాలి



మహిళా దినోత్సవం కేవలం ఒకరోజు చేసుకోవడం కాదు. రోజూ గౌరవం, సమానత్వ ఫలాలు అందాలి. భారతదేశంలో మహిళా విద్య కోసం సావిత్రిబాయి పూలే బలమైన పునాది వేశారు. దేశంలో మహిళల అక్షరాస్యత 65.5 శాతమే. ఉద్యోగ రంగంలో 25 శాతమే, 40 శాతం మంది మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారు. ప్రతి 16 నిమిషాలకో అత్యాచారం, 4 నిమిషాలకో గృహ హింస కేసు నమోదు అవుతోంది. సాధికారత కోసం ఇంకా చాలా మార్పులు అవసరమని స్పష్టమవుతోంది.

–జి.శిరీష, పీహెచ్‌డీ రీసెర్చ్ స్కాలర్, హెచ్‌సీయూ


పర్యాటక, ఆతిథ్య రంగాలలోనూ..



పర్యాటక, ఆతిథ్య రంగాలలో మహిళల పాత్ర ఉంది. ఎక్కువ మంది ఈ కోర్సులలో చేరుతుండగా వారికి ఉపాధి అవకాశాలు ఉంటున్నాయి. తాజాగా రాష్ట ప్రభుత్వం ఆదేశంపై సెర్ప్ సహకారంతో నిథమ్‌లో ఇందిరమ్మ క్యాంటిన్ల నిర్వాహకులకు ఇప్పటివరకు 214 మందికి శిక్షణ ఇచ్చాం. కొందరు విజయవంతంగా క్యాంటిన్ల నిర్వమిస్తున్నారు.

– మిషెల్లి జే ఫ్రాన్సిస్, నిథమ్ శిక్షణ ప్లేస్‌మెంట్ సెల్ అధికారి, గచ్చిబౌలి

మహిళలు పోషకాహారం తీసుకోవాలనే లక్ష్యంతో..



ప్రస్తుతం మహిళలకు చిరుధాన్యాలు (మిల్లెట్స్) ఎంతో ముఖ్యం. ఆహారంలో ప్రతిరోజు ఇవి భాగంకావాలి. రైతు కుటుంబాలతో మిల్లెట్స్ బ్యాంక్ ఏర్పాటు చేశాం. మహిళలు ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో ఆదిశగా సాగుతున్నాం.

– ఉయ్యాల విశాలారెడ్డి, మిల్లెట్‌బ్యాంకు వ్యవస్థాపకులు

స్త్రీ ఆరోగ్యంగా ఉంటేనే..



ఆడవాళ్ళ ఆరోగ్యం బాగుంటేనే గృహమంతా ఆరోగ్యంగా ఉంటుంది. పుట్టినప్పటి నుంచి ఆరోగ్యంగా ఉండేలా చూడాలి. కొండాపూర్ ఆస్పత్రిలో సాధారణ కాన్పులకే అత్యధిక ప్రాధాన్యం. ఈ ఆస్పత్రి పేదలకు భరోసానిచ్చేలా పనిచేస్తున్నా.

– డా.అనురాగినిరెడ్డి, సూపరింటెండెంట్, కొండాపూర్ జిల్లా ఆస్పత్రి

స్వశక్తితో ఎదగాలనే పట్టుదల



స్వశక్తితో ఎదగాలనే మా పట్టుదలకు నిథమ్, సెర్ప్ అధికారులు అండగా నిలిచారు. సెక్రటేరియట్‌లో క్యాంటిన్ నిర్వహిస్తున్నాం. రోజువారి వ్యాపారమే కాకుండా మంత్రులు, అధికారుల కార్యాలయాల నుంచి కూడా ఆర్డర్లు వస్తున్నాయి. భవిష్యత్తులో మంచి గుర్తింపు సాధించాలన్నదే మా కోరిక.

-కృష్ణకుమారి, స్వాద్ ఫుడ్ ప్రోడక్ట్స్, సెక్రటేరియట్ ఇందిరమ్మ క్యాంటిన్ నిర్వాహకురాలు

అన్ని రంగాలలో రాణిస్తున్నా కానీ..



ప్రస్తుతం మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నా ఇప్పటికీ దాడులు, అత్యాచారాలు ఆగడం లేదు. వాటిని పూర్తి స్థాయిలో అరికట్టేందుకు ప్రభుత్వాలు గట్టి చర్యలు తీసుకోవాలి. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు వెంటనే అమలులోకి తేవాలి. మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నాం అని చెప్పడం కాదని, నిరూపించేలా ఉండాలి.

-కన్యగారి లక్ష్మీ, భారత జాతీయ మహిళా సమాఖ్య, శేరిలింగంపల్లి ప్రధాన కార్యదర్శి

సమస్యల పరిష్కారానికి కృషి

పటాన్‌చెరు: సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు కృషి చేస్తున్నానని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. శనివారం అమీన్‌పూర్ పీపుల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపీని కలిసి అమీన్‌పూర్‌లో నెలకొన్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. పట్టణంలో అంతర్గత రోడ్లు, పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉందని వివరించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ... అమీన్‌పూర్ పరిధిలోని సమస్యలపై తాను ఎప్పటికప్పుడు సమాచారం తీసుకుంటున్నట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణం పూర్తి చేసేలా తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో పీపుల్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తిరుమలరెడ్డి, కొండ లక్ష్మణ్, మహేశ్వర్‌రెడ్డి, ఉదయ్ కుమార్, వెంకట పుల్లారెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

టీ గోల్ఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉమెన్స్ డే టోర్నీ



గచ్చిబౌలి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టీ గోల్ఫ్ ఫౌండేషన్ మహిళా గోల్ఫర్ల కోసం ఉమెన్స్ డే టోర్నమెంట్ నిర్వహించింది. గచ్చిబౌలిలోని బౌల్డర్ హిల్స్ గోల్ఫ్ కంట్రీ క్లబ్ వేదికగా ఈ టోర్నీ జరిగింది. కొత్తగా గోల్ఫ్ నేర్చుకోవాలనుకున్న 50 మంది మహిళా గోల్ఫర్లకు సైతం రోజంతా స్పెషల్ ట్రైనింగ్ ఇచ్చారు. కేటగిరీ ఏలో విజేతగా శ్యామల, రన్నరప్ గా హ్యాన్ జంగ్ పార్క్ , కేటగిరీ బిలో విజేతగా గురుప్రీత్, జున్ యంగ్ కిమ్, గ్రాస్ విన్నర్ గా రేఖా సిన్హా, గ్రాస్ రన్నర్ గా నేహా అహ్లూవాలియా నిలిచారు. అన్ని రంగాల్లో ముందంజ వేస్తున్న మహిళలు గోల్ఫ్ క్రీడలోనూ రాణించాలన్న ఉద్దేశంతో యాక్సిలరేట్ యాక్షన్ థీమ్ పేరుతో దీనిని నిర్వహించినట్లు టీ గోల్ఫ్ ఫౌండేషన్ ప్రెసిడెంట్,సీఈవో డాక్టర్ ఎస్‌ఆర్‌ఎస్ రెడ్డి చెప్పారు. విజేతలకు టీ గోల్ఫ్ ఫౌండర్ ఎస్‌ఆర్‌ఎస్ రెడ్డి, వి స్పాజో ఎండి తన్మయి, బౌల్డర్ హిల్స్ గోల్ఫ్ కంట్రీ క్లబ్ సీఎఫ్ వో మధుసూదనరావు, మేఘవి వెల్ నెస్ స్పా కో ఫౌండర్ మేఘా దినేశ్ బహుమతులు అందజేశారు.

యువత సామాజిక, రాజకీయ రంగాల్లో రాణించాలి



పుస్తకావిష్కరణ చేస్తున్న అతిథులు

రాయదుర్గం: ఓబీసీ యువత సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో రాణించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ఓబీసీ యూత్ సమ్మిట్-2025 డిమాండ్ చేసింది. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలోని సావిత్రిబాయి పూలే ఆడిటోరియంలో అఖిల భారత ఓబీసీ విద్యార్థుల సంఘం జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఓబీసీ యూత్ సమ్మిట్-2025ను శనివారం నిర్వహించి ఆరు తీర్మానాలను ఆమోదించింది. ముఖ్యంగా ఓబీసీ విద్యార్థులకు ఫెలోషిప్‌ల పెంపు, ఉన్నత విద్య, పరిశోధనలో అవకాశం, ఓబీసీ యువతకు వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో స్థిరపడేందుకు ప్రభుత్వ సహాయం అందించాలి, దేశవ్యాప్తంగా జాతి జనగణన నిర్వహించాలి. మహిళా రిజర్వేషన్లలో ఓబీసీలకు ప్రాధాన్యం కల్పించాలి, తదితర అంశాలపై తీర్మానించారు. ఈ సందర్భంగా బీపీ మండల్ మనవడు డాక్టర్ సూరజ్ మండల్ మాట్లాడుతూ.. ఓబీసీ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ ఎరవత్రి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, బీఎస్పీ ఏపీ సమన్వకర్త పూర్ణచంద్రరావు, ఓబీసీ హక్కుల పరిరక్షకుడు డాక్టర్ అంజయ్య షెపర్డ్, ప్రొఫెసర్ త్రివేణి, డాక్టర్ లత ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మురళీకృష్ణ, శివ యాదవ్, మౌనిక, లక్ష్మీ నరసయ్య, రామ్‌గౌడ్, వినయ్, భరత్, ప్రవీణ్, చంద్రశేఖర్, మేఘనా, మల్లేష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో శనివారం టొరంటో, కెనడా నుంచి వచ్చిన కళాకారిణి శక్తి సంజన సిరాల తన ప్రదర్శనలో ఆకట్టుకున్నారు. హస్యబ్రహ్మ డాక్టర్ శంకరనారాయణ రచన వ్యాసంగాలలో హస్యవల్లరి చేస్తూ అలరించారు. 50 సంవత్సరాలుగా తెలుగు సాహిత్యంలో చేస్తున్న కృషిని గుర్తించి రమ్యానాయుడు ఆధ్వర్యంలో శ్రీరాగ రమ్య సాంస్కృతిక సేవా సంస్థ స్వర్ణోత్సవ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు.

30న ఉగాది పండుగ

పటాన్‌చెరు టౌన్: ఉగాది పర్వదినాన్ని మార్చి 30వ తేదీన నిర్వహించుకోవాలని పటాన్‌చెరులో పుర ప్రముఖుల సమావేశంలో నిర్ణయించారు. శనివారం పట్టణంలోని శ్రీ కోదండ సీతారామస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, ఎమ్మెల్యే సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సపాన్‌దేవ్, మాజీ ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు హాజరయ్యారు. వేద పండితుల సూచనలకు అనుగుణంగా..మార్చి 30న ఉగాది, ఏప్రిల్ 4 నుంచి 8 వరకు శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కాయిదమ్మకుంట చెరువు రూపు రేఖలు మారుస్తాం



చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని కాయిదమ్మకుంట చెరువును పునరుద్ధరించి రూపురేఖలు మారుస్తామని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. శనివారం ఆయన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలిసి చెరువును పరిశీలించి మాట్లాడారు. చెరువులో మురుగు నీరు కల్వకుండా ఇరిగేషన్ అధికారులు గతంలో యూజీడీ పైపులైన్ చేపట్టడం జరిగిందన్నారు. ఔట్‌లెట్‌లో నీరు సక్రమంగా పోవడంలేదన్నారు. ఇప్పటికైనా ఔట్‌లెట్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట అశోక్ గౌడ్, గౌతమ్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్, ప్రకాష్ గౌడ్, దేవేందర్ గౌడ్, రాంబాబు గౌడ్, హరికృష్ణ ఉన్నారు.

కనులపండువగా కల్యాణం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల గ్రామంలో శనివారం రాత్రి శ్రీలక్ష్మీఅనంత పద్మనాభస్వామి కల్యాం కనులపండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంప ల్లి నియోజకవర్గం పరిధిలో పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శనివారం అందజేశారు. 44 మంది లబ్ధిదారులకు 19లక్షల 15 వేల 500 రూపాయల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఆపన్న హస్తం అందిస్తుందన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ అశోక్‌గౌడ్, నాయకులు రఘునాథ్‌రెడ్డి, ఆదర్శ్‌రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, నాయినేని చంద్రకాంత్ రావ పాల్గొన్నారు.



చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే గాంధీ

18 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 18 మందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహన దారులను శనివారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.